## క్లుప్తంగా

### పెండింగ్ డీఏలు చెల్లించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా కోరారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రేపటి నుంచి 17వ తేదీ వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. సీహెచ్ఎస్ పరిమితిని 25 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి. నరసింహులు, శ్రీనివాసులు, గురవయ్య జిల్లా సెక్రెటరీ రామచంద్రారెడ్డి, మస్తాన్ బాబు, మణికుమార్, నరసింహబాబు, సలాం పాల్గొన్నారు

### ఆత్మహత్య వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఆత్మహత్యలకు పాల్పడవద్దని, బతికి సాధించాలని అమృత హస్తం సేవా సంస్థ నాయకుడు పట్టెం కిరణ్ గంగిరెడ్డి సూచించారు. అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం భూ విజ్ఞాన శాస్త్రం విభాగంలో అమృత హస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్య నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ ఎన్ని సమస్యలున్నా ఎవరు ఆత్మహత్యల జోలికి వెళ్లొద్దన్నారు. ఈ కార్యక్రమంలో భూ విజ్ఞాన శాస్త్ర అధ్యాపకులు ప్రొఫెసర్ వి. సునీత, ప్రొఫెసర్ కె.రఘుబాబు, ప్రొఫెసర్ ఎస్ జయరాజు, డాక్టర్ ఎస్.శ్రీనివాస గౌడ్, డాక్టర్ ఎస్. సిద్దిరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సయ్యద్ నూర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన కడప సిద్దిక్‌నగర్ వైఎస్సార్‌కాలనీ ఎంపీయూపీ ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ నూర్‌ను కడప 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఎస్. ఖాదర్ బాషా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అవార్డు గ్రహీత సయ్యద్ నూర్ సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం మనందరికీ గర్వకారణమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి సయ్యద్ నూర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అన్నక్యాంటీన్‌లో భోజన నాణ్యత బాగుండాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: అన్న క్యాంటీన్‌లో భోజన నాణ్యత సక్రమంగా ఉండాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన సౌత్‌జోన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పాతబస్టాండు అన్నక్యాంటీన్‌ను పరిశీలించి భోజన నాణ్యత, సిబ్బంది పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 19వ డివిజన్‌లో జరిగే శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త, ప్రతి కాలువలో పూడికను సకాలంలో తొలగిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆరోగ్యమాత తిరునాలలో వెలువడిన చెత్తను సకాలంలో తొలిగించాలని ఆదేశించారు.

### 17న క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈనెల 17న నెహ్రూ యువ కేంద్రం సహకారంతో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. యువకులకు వాలీబాల్, మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 15 నుంచి 25 ఏళ్లలోపు యువతీ యువకులకు పోటీల్లో పాల్గొనాలని, మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966475742, 9154195061 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

# రైతు సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారు
- అన్నదాతలు క్యూలో ఉంటే బఫే భోజనాలతో పోల్చడం దురదృష్టకరం
- ఇలాంటి సీఎం, వ్యవసాయ శాఖామంత్రి ఉండటం మన ఖర్మ
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడమే లేదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజమెత్తారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ‘రైతు పోరు’ పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్, ఎన్‌టీఆర్ కూడలి, ఏడు రోడ్ల కూడలి మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకూ చేరింది. అక్కడ ఏఓ శంకర్ రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో సంబంధం లేకుండా ఏడాదికి రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి, మొదటి ఏడాది ఎగ్గొట్టారని, రెండో ఏడాది కేవలం రూ.5వేలే ఇచ్చారని తెలిపారు. రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులును ఆదుకుంటామన్నారని, రెండు బడ్జెట్‌లు పూర్తయినా ఆ నిధి ఊసే లేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిల్చుంటే వ్యవసాయ శాఖామంత్రి బఫే భోజనాలతో పోల్చి అవహేళన చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. వ్యవసాయం దండగ అనేలా వ్యవహరించే ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖామంత్రి ఉండటం మన ఖర్మ అని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఎందుకున్నారో, అసలు రాజకీయాల్లోకి ఎందుకొచ్చారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు.

**యూరియా, ఎరువులను సరఫరా చేయాలి**

రైతులు పండించిన ఏ పంటలకు గిట్టుబాటు ధర లేదని, ఉల్లి, మిరప, మినుము, చీనీ ఇలా ప్రతి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఇంతవరకూ ఏ పంటనూ కొనుగోలు చేయలేదన్నారు. రైతులు పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. ఆర్‌బీకేల ద్వారా సరిపడా విత్తనాలు, యూరియా, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం నగర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు యానాదయ్య, జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, ఐస్‌క్రీం రవి, పి. రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు షఫీ, షంషీర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు జాషువా, దేవిరెడ్డి ఆదిత్య, రామక్రిష్ణారెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, గుంటి నాగేంద్ర, బండి దీప్తి, పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్, షఫీవుల్లా, త్యాగరాజు, బండి ప్రసాద్, రమేష్‌రెడ్డి, ఆర్‌వీ రమణ, సంపత్, చైతన్య,పస్తం అంజి, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, బి. మరియలు, క్రిష్ణవేణి, నారాయణమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

**30 యాక్టు ఇప్పుడే గుర్తొచ్చిందా?**

రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంటే పోలీసులు 30 యాక్టు అమల్లో ఉందని తమకు నోటీసులివ్వడం అన్యాయమని అంజద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాలు జరిగేటప్పుడు కూడా 30 యాక్టు అమల్లో ఉంటుందని, కానీ ఎమ్మెల్యే తన అనుచరులతో ర్యాలీగా వచ్చి గందరగోళం సృష్టించినా పోలీసులు ఏమీ అనరని పేర్కొన్నారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తామంటే నోటీసులిచ్చి నిలువరిస్తున్నారన్నారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.




ఆర్‌డీఓ కార్యాలయం వద్ద బారికేడ్లు వేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

### ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప మండలంలోని పాత కడప గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వలన ఖర్చులు తగ్గి ఆరోగ్యవంతమైన పంటల దిగుబడులు వస్తాయన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన మేరకు ఎరువులను వాడాలని అధిక మోతాదులో ఎరువులను వాడకూడదని సూచించారు. నత్రజనిని మొదటి దఫా నాటిన 15 రోజులకు, రెండోసారి పిలక దశలోనూ, చివరిసారి అంకురం ఏర్పడే దశలోను పొటాష్ ఎరువులతో పాటుగా వేసుకోవాలని తెలియజేశారు. జింకు ప్రతి మూడు పంటలకు ఒకసారి తప్పనిసరిగా ఎకరాకి 20 కేజీల చొప్పున వాడాలని చెప్పారు. వరి సాగులో లేత ఆకులు తెల్లగా పాలిపోయినట్లయితే ఇనుప దాతు లోపంగా గుర్తించి, లీటర్ నీటికి 20 గ్రాముల అన్నబేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేసి, ఇనుమదాసు లోపాన్ని సవరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. దస్తగిరి ఆత్మ ఏటీఎం రాధిక, రైతులు పాల్గొన్నారు

# దళిత మహిళకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న స్రవంతి, దళిత నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో టెండర్లు వేసిన వాటికి మళ్లీ టెండర్లు వేయడం దారుణమని, ముందు టెండర్ వేసిన దళిత మహిళ స్రవంతికి గదులు చూపెట్టకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు మండిపడ్డారు. స్రవంతికి న్యాయం చేయాలని ఆర్టీసీ టెండర్ వేసిన గదుల ఎదుట దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు మాతంగి సుబ్బరాయుడు, సగిలి గుర్రప్ప, ఆంజనేయులు మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండులో గత ఏడాది క్రితం టెండర్లు వేసిన వారికి ఇంతవరకు గదులు చూపెట్టలేదని, ఆర్టీసీ ఆర్ఎం, ఈడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వేసిన టెండర్లకు మళ్లీ టెండర్లు పిలవడం దారుణమని, గదుల విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఆర్టీసీ టెండర్లలో స్రవంతి అనే దళిత మహిళ పాల్గొని పీ17ఏ, పీ17సి రూములను దక్కించుకున్నారని, టెండర్ అలాట్‌మెంట్ ఆర్డర్ కూడా ఆర్టీసీ యాజమాన్యం జారీ చేసిందని, అయితే ఇంతవరకు కొలతలు వేసి రూములు చూపెట్టకుండా ఆర్టీసీ ఆర్ఎం, ఈడీ, సివిల్ ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు జోక్యం చేసుకుని న్యాయపరంగా దక్కాల్సిన రూములను ఆయా టెండర్లదారులకు దక్కేలా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఐక్యవేదిక నాయకులు ఓబులేసు, ప్రసాద్, డీసీ గంగులు పాల్గొన్నారు.

# సంతానం లేనివారికి దత్తత ఓ వరం



అవగాహన కల్పిస్తున్న శిశు గృహ మేనేజర్ ఎం. కుమారి


కడప కోటిరెడ్డి సర్కిల్ : పిల్లలు లేని వారికి పిల్లలు పొందడానికి దత్తత అనే కార్యక్రమం ఒక వరం లాంటిదని శిశు గృహ మేనేజర్ ఎం.కుమారి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని కొండాయపల్లెలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా దత్తత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మాతృత్వం పొందాలనుకోవడం ప్రతి దంపతుల కోరిక అని, అలాంటి కోరికను దత్తత కార్యక్రమం ద్వారా పిల్లలను పొందే వరాన్ని ప్రభుత్వం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ దత్తతను కారా నియమ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నుంచి దత్తత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు కడప కలెక్టరేట్‌లోని శిశు అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు. సోషల్ వర్కర్ పద్మిని మాట్లాడుతూ 0–18 సంవత్సరాల పిల్లల రక్షణ, సంరక్షణ కార్యక్రమాల గురించి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 181కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబుషాన్ మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మానసికంగా శారీరకంగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పచ్చని తివాచీ పరిచినట్టు..

ఈ దృశ్యాలు చూడడానికి రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ..! ఇంతటి పచ్చదనం చూసి కోనసీమ అనుకునేరు.. మన వైఎస్సార్ జిల్లా సిద్దవటం, చెన్నూరు సమీపంలోని పంటపొలాలు. ఖరీఫ్‌లో రైతులు వరి సాగు చేయగా పైరు పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని పొలం గట్లతో ప్రకృతి అందాలు అదరహో అనిపిస్తున్నాయి. కొండల నుంచి చల్లగాలి వీస్తున్న తరుణంలో నింగి నుంచి మేఘాలు తొంగి చూస్తున్నట్లు కనువిందు చేస్తున్నాయి. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. భూమాతకు పచ్చని చీర కట్టినట్టుగా ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు కొద్ది సేపు ఆగి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. – కడప అగ్రికల్చర్



సిద్దవటం సమీపంలో పచ్చదనంతో వరి పొలాలు



చెన్నూరులో కళకళలాడుతున్న వరిపంట

# ఇక పెయ్య దూడలే పుడుతాయి

- పెయ్య దూడల ఉత్పత్తికి సెక్స్ సార్టెడ్ సీమన్
- రూ.150 అందుబాటులో మందు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న పశువైద్యులు



పెయ్య దూడకు జన్మనిచ్చిన గేదె

కడప అగ్రికల్చర్: కృత్రిమ గర్భం విధానంలో పశు సంతతి పెంచే విధానం ఇప్పటివరకు అమల్లో ఉంది. ఈ పద్ధతిలో గిత్తల వీర్యం సేకరించి పశువులకు ఇంజెక్ట్ చేస్తే ఆడా లేదా మగ దూడలు పుడుతుంటాయి. పశువు ఎదకువచ్చిన సమయంలో మేలైన సంతతి కోసం ఇప్పటివరకు ఈ విధానాన్ని పాటిస్తున్నారు. అయితే పాల ఉత్పత్తి పెంచేలా సాంకేతిక పరిజ్ఞానంతో పశుసంవర్ధకశాఖ చూడి పశువులకు పెయ్య (ఆడ) దూడలు పుట్టే విధంగా లింగ నిర్ధారణ వీర్య పథకం ‘సెక్స్ సార్టెడ్ సీమెన్’ తీసుకువచ్చింది. ఈ సాంకేతికత ద్వారా 90 శాతం వరకు ఆడ దూడలను పొందవచ్చు. ఇది పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడంలో సహాయ పడుతుంది. రూ.1500 విలువ గల ‘సెక్స్ సార్టెడ్ సీమెన్’ను రూ.150 పొందేందుకు స్థానిక పశుసంవర్ధక శాఖ లేదా పశువైద్య అధికారులను సంప్రదించాలి.

**లక్ష్యాలు..**

- లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావలసిన మేలైన పెయ్య దూడలను 90 శాతం ఖచ్చితత్వంతో పుట్టించి, పాల దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడం.
- తక్కువ సమయంలో ఎక్కువ మేలుజాతి పెయ్య దూడలను పుట్టించడం ద్వారా గ్రామాల్లో మేలుజాతి పశుసంపదను అభివృద్ధి చేయడం.
- లింగ నిర్ధారిత వీర్యం యొక్క సాంకేతికతను రైతుల దగ్గరకు చేర్చడం, సబ్సిడీ ద్వారా అందుబాటులో ఉంచడం.

**అన్ని గ్రామాల్లో..**

- ప్రతి జిల్లాలో మేలైన పశు సంపద మరియు ఔత్సాహిక పశుపోషకులు కలిగిన గ్రామాలను ఎంపిక చేయడం.
- ఎంపిక చేసిన గ్రామాల్లో కనీసం 35 నుంచి 40 పశువులను గుర్తించి, రైతులతో ఒప్పందం చేసుకొని లింగ నిర్ధారిత వీర్యంతో పశువులను కట్టించిన యెడల 25 ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంది.
- అలా పుట్టిన దూడలు 3 నుంచి 4 సంవత్సరాల తరువాత పెద్దవై, చూలుకట్టి, ప్రసవించిన తర్వాత ఆ గ్రామాల్లో రోజుకు కనీసం 200 నుంచి 250 లీటర్ల పాల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

**లబ్ధిదారులు, పశువుల ఎంపిక**

- లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక పశుపోషకులు అందరూ అర్హులే.
- ఈ మధ్య ఈనిన (60 నుంచి 90 రోజులలోపు), 1 నుంచి 3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వచ్చే ఆరోగ్యవంతమైన, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని పశువులలో కట్టు శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వాటిని ఎంపిక చేస్తారు

**అమలు విధానం**

- పశువులకు కృత్రిమ గర్భధారణ చేసిన తర్వాత ఉపయోగించిన లింగ నిర్ధారిత వీర్యనాళికలను రైతుకు భరోసా కొరకు అందించడం. వీటిపై ప్రత్యేక సంఖ్య ముద్రించబడి ఉంటుంది.
- పశువులలో ఎద లక్షణాలను గుర్తించడం, వాటికి కృత్రిమ గర్భధారణ చేయించే ఖచ్చితమైన సమయం మొదలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, సలహాలను పశువైద్య సిబ్బంది ద్వారా రైతుకు ముందుగానే తెలియజేస్తారు.

**పథకం ప్రయోజనాలు**

- ప్రస్తుత కృత్రిమ గర్భధారణ పద్ధతిలో మగ, ఆడ దూడలు పుట్టే శాతం సగం, సగంగా ఉంది. అయితే, లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం వల్ల 90 శాతం పెయ్య దూడలు పుట్టి రైతులకు లాభదాయకంగా మారుతుంది.
- పాడి రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, ఎన్‌జీఓ, రైతు సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి.
- ఈ విధంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెక్స్ సార్టెడ్ సీమెన్ సాంకేతికతను ప్రోత్సహించి, పశుసంవర్ధకులను ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహాయపడుతోంది.

**అన్ని చోట్ల అందుబాటులో..**



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పాల్ల ఉత్పత్తి పెంచడం కోసం పెయ్య దూడల ఉత్పత్తి పథకం కింద ప్రతి రైతులకు రూ. 150 సెక్స్ సార్టెడ్ సీమెన్ అందచేస్తున్నాం. దీని వలన 90 శాతం ఆడ దూడలను పొందవచ్చు. జిల్లాలో జూన్ నెల నుంచి ఈ పథకం ప్రారంభమైయింది. అన్ని గ్రామీణ పశువైద్య శాలలు, రైతు సేవా కేంద్రాల్లో లభిస్తుంది. కావాల్సిన రైతులు పొందవచ్చు.

– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశువైద్యాధికారి, వైఎస్సార్‌జిల్లా

### దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థి దంతాలను పరీక్షిస్తున్న వైద్యురాలు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దంత సమస్యలు రావని రిమ్స్ దంత వైద్యుడు నరసింహారావు అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని బుచ్చర్‌స్ట్రీట్ ఎంసీహెచ్ఎస్ ఉర్దూ స్కూల్లో దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రిమ్స్ వైద్యులు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలకు సంబంధించిన సమస్యల గురించి వివరించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా దంతాలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు నాయబ్‌రసూల్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నజీబుల్లా, ఉపాధ్యాయులు జరీనా, బిబి అయిషా, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామికి పూజలు

పులివెందుల రూరల్ : నల్లగొండువారిపల్లె సమీపంలోని గుట్టపైన గ్రామస్తులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే ప్రతి శనివారం ఆంజనేయస్వామికి పూజలతోపాటు అన్నదానం చేస్తామని వారు తెలిపారు.

### 13న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామినీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కొరకు ఫోన్ నంబర్లు 08562 258622, 244622 సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్‌ల ద్వారానే సత్వర న్యాయం లభిస్తుందని పేర్కొన్నారు.

# విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన



క్షేత్రస్థాయి కార్యక్రమంలో పోదార్ ఇంటర్నేషన్ స్కూల్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: వర్, సేవ్, సస్టెయిన్ అనే ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్ట్ లెర్నింగ్ (ఐపీఎల్) అంశంలో భాగంగా కడప పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థులు మంగళవారం ఓబులంపల్లె గ్రామాన్ని సందర్శించారు. ఈ విద్యా యాత్రలో విద్యార్థులు సంప్రదాయ వ్యవసాయ క్షేత్రంతోపాటు అర్బన్ ఫార్మ్‌ను పరిశీలించారు. రైతుల పద్ధతులు, పంటల సాగు, సహజ వ్యవసాయం విధానాలు, అలాగే పట్టణాల్లో ఉపయోగించే ఆధునిక పద్ధతులపై అవగాహన పొందారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు ఆహారాన్ని ఆస్వాదించడం వృథా తగ్గించడం, పర్యావరణాన్ని కాపాడటం వంటి విలువలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ మాధవి శర్మ మాట్లాడుతూ ఇలాంటి పర్యటనలు విద్యార్థులకు పుస్తకాలకతీతమైన అనుభవాన్ని అందించి, జీవన విధానంలో విలువలను పెంపొందిస్తాయని అని పేర్కొన్నారు.

# అధ్యాపకురాలికి ‘స్పెయిన్’ ఆహ్వానం



అధ్యాపకురాలు సుజాతను అభినందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం పెయింటింగ్ విభాగం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సుజాతకు 2026 మే నెలలో స్పెయిన్‌లో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. సదస్సు నిర్వాహకులు ఫెర్నాండెజ్ ఇ–మెయిల్ ద్వారా ఆమెను ఆహ్వానించారు. ప్రస్తుతం సుజాత, యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళాశాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మార్గదర్శకత్వంలో విజయనగర పెయింటింగ్స్‌పై పరిశోధన చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా తిరుపరట్టికుంద్రం ఆలయంలోని ఉన్న జైన్ కుడ్య చిత్రాలపై రీసెర్చ్ గైడ్తో సంయుక్తంగా ప్రచురించిన పేపర్ ఆధారంగా నిర్వాహకులు సుజాతను ఆ సదస్సులో ప్రారంభ సమావేశంలో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారని మృత్యుంజయరావు తెలిపారు.